క్లుప్తంగా

లఘు చిత్ర పోస్టర్ ఆవిష్కరణ



పొన్నూరు: పట్టణంలోని తోటమ్మ తల్లి దేవాలయం వద్ద బుధవారం ని సార ఎంటర్‌టైన్మెంట్ నిర్మాణంలో పొన్నూరుకు చెందిన నటుడు నోవెల్ నిసార్ నటించిన 'సీనయ్య బండి' లఘు చిత్రం పోస్టర్‌ను పూర్వ విద్యార్థులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనయ్య, నాయకులు కత్తుల రవి కిరణ్, పొన్నూరు అంజుమన్ సంయుక్త కార్యదర్శి మజ్జిదా, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సభ్యుడు చలపతిరావు, నిసార్ ఆర్ట్స్ స్కూల్ నిర్వాహకులు జాన్ షహీద్, 1991 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురు పూజోత్సవం



పొన్నూరు: నిడుబ్రోలు ఆలూరు రోడ్డులోని శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారి సేవా సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామి 26వ ఆరాధన గురుపూజోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. వైకుంఠ శుద్ధ దశమి స్వామివారి ఆరాధన సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహా నివేదన అనంతరం అన్న సంతర్పన ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

పార్టీ కుటుంబ సభ్యుని మృతికి నివాళి



గుంటూరు రూరల్: మండలంలోని 26వ డివిజన్ దాసరిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యుడు కొర్నెపాటి తేజ మంగళవారం అకాల మృత్యువాతకు గురైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం తేజ మృత దేహానికి నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్ కుమార్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన తేజ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి.. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసాను కల్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



గుంటూరు రూరల్: మండలంలోని బుడంపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ, సహాయ శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక ఎమ్మెల్యే బి.రామాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శివారు ప్రాంతాల్లో వేసవిలో విద్యుత్ అవాంతరాలను తీర్చేందుకు సబ్‌స్టేషన్‌లు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రజల సౌకర్యార్థం ఇదే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ నమోదు చేసుకోవాలి

లక్ష్మీపురం: ప్రతి అసంఘటిత కార్మికులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ పోర్టల్ నమోదు చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్ కోరారు. మంగళగిరి రోడ్డులోని వాసవి సేల క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ-శ్రమ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి సయ్యద్‌జియావుద్దీన్ మాట్లాడుతూ ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదు అయిన వారికి ప్రమాదంలో మృతిచెందినా, అంగవైకల్యం కలిగినా బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందుతుందని చెప్పారు. న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది కట్టా కాళీదాసు మాట్లాడుతూ ఈ-శ్రమ పోర్టల్‌లో సభ్యత్వం వల్ల కలిగే లబ్ధి గురించి వివరించారు. ఉప కార్మిక కమిషనర్ ఎ.గాయత్రిదేవి మాట్లాడుతూ 16 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు తమ ఆధార్ కార్డు, లింక్ కాబడిన ఫోన్ నంబరు, బ్యాంకు అకౌంట్ నంబరు వివరాలు తీసుకుని దగ్గరలో ఉన్న సీఎస్‌సీ సెంటర్, కార్మిక శాఖ కార్యాలయం వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం 9492555157ను సంప్రదించాలని కోరారు.

మత్తు వదలని అక్రమార్కులు



గంజాయి సేవించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాటిల్



మద్యం, ఇతర మత్తు పదార్థాల బాటిల్స్

- పొలిమేర, పంట పొలాల్లో గంజాయి సేవిస్తున్న యువత
- విద్యార్థులు, యువతే లక్ష్యంగా గంజాయి విక్రయాలు
- పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రుల ఆందోళన

గుంటూరు రూరల్: మత్తు పదార్థాలు సేవించరాదు.. సేవిస్తే జీవితాలు నాశనమవుతాయని ఒక పక్క ప్రభుత్వాలు, మరో పక్క అధికారులు ఊదరగొడుతున్నా గంజాయి క్రయ విక్రయాలు మాత్రం తగ్గడంలేదు. చెట్లు, పుట్టలు, కొండలు, పొలిమేరలు, పొలాలను ఆసరాగా చేసుకుని గంజాయి సేవించే వారు నానాటికీ అధికమవుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతే లక్ష్యంగా గంజాయి విక్రయదారుల పేట్రేగిపోతున్నారు. అధికారులు దాడులు చేసి గంజాయి సేవించే వారిని, విక్రయాలు చేసేవారిని అదుపులోకి తీసుకుంటూనే ఉన్నారు. అయినప్పటికీ పోలీసులు, అధికారుల కన్నుకప్పి మత్తు పదార్థాల విక్రయాలతో సొమ్ము చేసుకుంటున్నారు. నగర శివారు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు, వాటిని సేవించడం జరుగుతూనే ఉందని.. మత్తు ఊబిలో ఉన్న యువత ప్రధాన రహదారుల్లో దాడులు, చోరీలకు పాల్పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు.

గంజాయి ఆకు నుంచి లిక్విడ్ రూపంలో..

గతంలో గంజాయిని ఆకు రూపంలో విక్రయించేవారు. పోలీసుల దాడులు, అరెస్టుల నేపథ్యంలో గంజాయిని లిక్విడ్ గంజాయిగా మార్చి విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం. లిక్విడ్ గంజాయిని చిన్నపాటి సీసాల్లో (గతంలో రక్తపరీక్షలు చేసే సీసాల్లాంటి వాటిలో) విక్రయించేవారు. దానిని సైతం పోలీసులు ఛేదించి అరెస్టులు చేస్తుండటంతో గంజాయి విక్రయదారులు దానిని చిన్నపాటి కవర్ ప్యాక్‌లలో రసనాలా తయారు చేసి విక్రయాలు చేస్తున్నారని సమాచారం. చిన్నపిల్లలు పాఠశాలల వద్ద విక్రయించే ఐస్ రసనాలా పోలి ఉండే లిక్విడ్ గంజాయిని ప్యాక్ చేసి విక్రయాలకు పాల్పడుతున్నారు. గంజాయి తాగేవారు సైతం ఎవ్వరూ గుర్తు పట్టకుండా చిన్నపాటి లిక్విడ్ గంజాయి ప్యాకెట్‌లను కొనుగోలు చేసి సేవిస్తున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..

లిక్విడ్ గంజాయిని 10 నుంచి 20 గ్రాముల ప్యాకెట్ రూపంలో విక్రయిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్ ధర రూ.300 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నట్లు సమాచారం. లిక్విడ్ గంజాయిని కొనుగోలు చేసిన వ్యక్తులు వాటిని నగర శివారుల్లో, గ్రామాల్లోని పంట పొలాల్లో ఎవరికీ కనిపించకుండా సేవిస్తున్నారు. ఇటీవల మండలంలోని వెంగళాయపాలెం గ్రామ శివారుల్లో ఓ పంట పొలంలో చెట్టుకింద గుట్టలుగా లిక్విడ్ గంజాయి ప్యాకెట్‌లు కనిపించాయి. వాటిని చూసిన రైతులు వ్యసనానికి అలవాటు పడిన వారు పంట పొలాలను సైతం నాశనం చేస్తున్నారని వాపోతున్నారు. అధికారులు శివారు ప్రాంతాల్లో గస్తీని పెంచి మత్తు వదలని అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ మాధవిలత

గుంటూరు రూరల్: సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పంటల ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని రైతుబజార్ సీఈవో డాక్టర్ మాధవిలత అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్, ఆర్‌వైఎస్‌ఎస్, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై అవగాహన సదస్సులో ఆమె బుధవారం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ప్రతీ రైతు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని వారం రోజులు అందుబాటులో ఉంచాలి



వెంకటేశ్వరరావుకు వినతి పత్రం సమర్పిస్తున్న మురళీమోహన్, అభ్యర్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగుల కోసం ప్రాంతీయ గ్రంథాలయాలు వారంలో ఏడు రోజులపాటు తెరిచే ఉంచాలని గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావుకు ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఈ మేరకు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో కలసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువుల కోసం డీఎస్సీకి సన్నద్ధమవుతున్న పేద, మధ్య తరగతి అభ్యర్థులు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి గ్రంథాలయానికి వచ్చి చదువుకుంటున్నారని తెలిపారు. ప్రతి గురువారం, రెండో శనివారం గ్రంథాలయానికి సెలవు కావడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డీఎస్సీ పరీక్షలు ముగిసే వరకు గ్రంథాలయాన్ని వారంలో అన్ని రోజులూ తెరిచే ఉంచేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రవికుమార్, పవన్‌కుమార్, ప్రతాపరెడ్డి, వీరయ్య, నాగేశ్వరరావు నాయక్, గోపీచంద్, వెంకటలక్ష్మి, లత, జ్యోతి, మౌనిక పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీల సమ్మెకు సీఐటీయూ మద్దతు



సమ్మెలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు

లక్ష్మీపురం: ఎంఎల్‌హెచ్‌పీల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె పోరాటానికి సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్న జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్ష పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన నాయకులు మాట్లాడుతూ ఆరు సంవత్సరాల తర్వాత రెగ్యులరైజ్ చేస్తాం అని ఇచ్చిన హామీని నిలుపుకోవాలని, గతంలో నేషనల్ హెల్త్ మిషన్ అన్ని క్యాడర్లకు ఏ విధంగానైతే వేతనాలు అన్ని క్యాడర్లకు 23 శాతం వేతనం పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, క్లినికల్ అద్దెలు చెల్లింపు కోసం చేపట్టిన న్యాయమైన పోరాటానికి సీఐటీయు మద్దతు తెలియజేస్తుందన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, నాయకులు షేక్ ఖాసిం షహీద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మాక్ డ్రిల్



పట్నంబజారు: ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం పోలీస్ అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడులు నిర్వహించిన నేపథ్యంలో ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో అవగాహన కలిగించే విధంగా డ్రిల్ చేపట్టారు. గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జీవీ రమణమూర్తి, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఏ హనుమంతు, ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వై.వీర సోమయ్య హాజరై మాక్ డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ఏ విధంగా వ్యవహరించాలని చేసి చూపించారు.

దాడి చేసి బెదిరించిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: దాడి చేసి బెదిరించిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. గౌతమినగర్ 3వ లైన్‌కు చెందిన షేక్ మక్తుం బాషా తాపీ పని చేస్తుంటాడు. ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికి వివాహం అయింది. రెండో కుమార్తెను నిడుముక్కల గ్రామానికి చెందిన షేక్ సుభాని కుమారుడు షేక్ షబ్బీర్ బాషా అలియాస్ తాడేపుల్ ఖాద్రికి ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం చేశాడు. అల్లుడు షబ్బీర్ బాషా నిడుముక్కల 101 దర్గాల ధర్మకర్తగా ఉంటారు. ప్రతి రోజు ముక్తుం బాషా భార్య ఇద్దరు ఉదయం సాయంత్రం దర్గాలో సేవ చేస్తు ఉంటారు. రెండు నెలల క్రితం రంజాన్ మాసం పూర్తి అయిన తరువాత బాజీ బాబా ఉరుసు రోజు అల్లుడు షబ్బీర్ బాషా అన్న షేక్ అహ్మద్ బాషాతో వివాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో ఇరువురు తాడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. అయిన అహ్మద్ బాషా, మక్తుం బాషాపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఈనెల 3వ తేదీన అరండల్‌పేట 10వ లైన్‌లో వెళుతుండగా వాహనాన్ని అడ్డగించి మక్తుం బాషాపై దాడి చేసి తీవ్రంగా గాయపరచి, హతమార్చేందుకు ప్రయతించాడు. గమనించిన స్థానికులు అడ్డుకోవడం అహ్మద్ బాషా అక్కడ నుంచి వెళ్లిపోయాడు. మక్తుం బాషా అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీనియర్ అథ్లెట్స్‌కు సత్కారం

గుంటూరు వెస్ట్: వరల్డ్ అథ్లెటిక్ డేను పురస్కరించుకుని జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బీఆర్ స్టేడియంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి, జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చల్లా వెంకటేశ్వరరెడ్డి, కొసనా వేణుగోపాల్‌లు క్రీడాకారులను సత్కరించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



పెదకాకాని: మండల పరిధిలోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ విశ్వవిద్యాలయంలో 10ఏ బాలికల బెటాలియన్ వార్షిక శిక్షణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. మంగళగిరి అగ్నిమాపక అధికారి వై.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు అగ్నిప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు అగ్నిమాపక పరికరాలు ఏ విధంగా వినియోగిస్తారో ప్రత్యక్షంగా ప్రదర్శించి వివరించారు. అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేజర్ అవినాష్ సట్వాల్, వీవీఐటీయూ ఎన్‌సీసీ ఆఫీసర్ ఎల్ డా.ఎ.శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలకు పాల్పడితే సహించం

గుంటూరు రూరల్: అధికారాన్ని అడ్డుపెట్టుకుని కక్షసాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం వట్టిచెరుకూరు మండలం ఇంజనంపాడులో పార్టీ నాయకులు మురుకుట్ల వెంకట సురేంద్ర తండ్రి సాంబశివరావు 10 రోజుల క్రితం టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడి చికిత్స పొందిన విషయం తెలుసుకుని వారిని పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వట్టిచెరుకూరు, ఇంజనంపాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ఏపీటీఎఫ్ ధర్నా

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగంతో పాటు ఉపాధ్యాయులకు నష్టం కలిగించే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మొహ్మద్ ఖాలీద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు విద్యారంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలను విడనాడాలని 12 డిమాండ్ల సాధనకై మూడు దశల్లో చేపట్టిన పోరాటంలో భాగంగా రెండో దశలో జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు తలపెట్టినట్లు చెప్పారు.

పోరాట యోధుడు అల్లూరి చిరస్మరణీయుడు



గుంటూరు ఎడ్యుకేషన్: బ్రిటీషు పాలకులను గడగడలాడించిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని యువజన సర్వీసులశాఖ సీఈఓ ఆర్.చంద్రముని పేర్కొన్నారు. బుధవారం బ్రాడీపేటలోని జయంతి నిలయంలో అల్లూరి వర్ధంతి నిర్వహించారు. చంద్రముని మాట్లాడుతూ మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడిన అల్లూరి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన విప్లవజ్యోతి అని, రెండేళ్లపాటు బ్రిటీషర్లకు కంటిమీద కునుకు లేకుండా చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ ప్రతినిధి డాక్టర్ బి.కృష్ణయ్య, సీనియర్ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, స్టెప్ మేనేజర్ బి.రాధిక, అధ్యాపకుడు శ్రీహర్ష, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన కళాపరిషత్ ఆహ్వాన నాటికల పోటీలు



కిడ్నాప్ నాటికలోని దృశ్యం

పొన్నూరు: పొన్నూరు కళాపరిషత్ నిర్వహణలో ప్రముఖ బుర్రకథ కళాకారులు పద్మశ్రీ షేక్.నాజర్ శతజయంతిని పురస్కరించుకుని నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదికపై 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు ప్రారంభమయ్యాయి. నన్నపనేని చంద్రమౌళీశ్వరీ, లయన్ ఆకుల కొండలరావు, నిజాంపట్నం తన్మయశ్రీ, కర్లపాలెంకు చెందిన చేబ్రోలు తానికల శాస్త్రీయ నృత్యాలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ నిర్వహణలో 'విడాకులు కావాలి' నాటిక ప్రదర్శించారు. పొత్తూరి విజయలక్ష్మీ మూలకథకు, గంగోత్రిసాయి దర్శకత్వం, వల్లూరి ప్రసాదు నాటికీకరించారు. అనంతరం తాడేపల్లి మోక్షిత శాస్త్రీయ నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కాట్రపాడు ఉషోదయ కళా నికేతన్ నిర్వహణ చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వంలో 'కిడ్నాప్' నాటిక ప్రదర్శించారు. అనంతరం సభకు పరిషత్ అధ్యక్షులు ఎస్.అంజనేయులు నాయుడు అధ్యక్షత వహించగా కార్యదర్శి సి.హెచ్.వి.రామకృష్ణారావు, గౌరవాధ్యక్షులు నన్నపనేని రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు శిబిరం



శిబిరంలో మాట్లాడుతున్న కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు: విభిన్న ప్రతిభావంతులు, వయోవద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాలను పంపిణీ చేసేందుకు లబ్ధిదారుల ఎంపిక శిబిరం బుధవారం నిర్వహించారు. నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు పాల్గొని పథకం వివరాలను వివరించారు. పురపాలక సంఘ పరిధిలోని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగులు, వయోవృద్ధులు పాల్గొని ఉపకరణాలు పొందేందుకు సంబంధిత పత్రాలను అధికారులకు అందజేశారు. మున్సిపల్ మేనేజర్ టి.వెంకటేశ్వరరావు, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ మాతకు మల్లెలతో అర్చన



విశేష పూజలో అమ్మవారు

చేబ్రోలు: వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని మండల కేంద్రమైన చేబ్రోలులో బుధవారం నిత్యానందాశ్రమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జయంతి ఉత్సవాల సందర్భంగా 108 మంది ఆర్యవైశ్య మహిళలతో 108 కలశాల పంచామృత అభిషేకములు, సహస్రనామ పారాయణ కార్యక్రమం వైభవంగా జరిపారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శ్రీరామచంద్రమూర్తితో లక్ష మల్లెల పూజ, ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు జరిగాయి. శారదా భజనమండలితో లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. నిత్యానందాశ్రమ సంఘం అధ్యక్షులు చీమకుర్తి కేశవ ప్రసాద్, కార్యదర్శి గుగ్గిలం సతీష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



రవీంద్రనాథ్ ఠాగూర్, అల్లూరి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సుబ్బరత్నమ్మ, ఝాన్సీలక్ష్మి



రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశం గర్వించే స్థాయిలో జాతీయ గీతాన్ని అందించిన రవీంద్రనాథ్ ఠాగూర్ మహనీయుడని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. బుధవారం అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ గీతాంజలి కావ్యాన్ని రచించిన రవీంద్రనాథ్ ఆసియాలోనే తొలిసారిగా నోబుల్ బహుమతి అందుకున్నారని తెలిపారు. మన్యం వీరునిగా ప్రజల గుండెల్లో నిలిచిన అల్లూరి సీతారామరాజు బ్రిటీషు పాలకులను గడగడలాడించారని కొనియాడారు. కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎం. సీతారామయ్య, గ్రంథ పాలకులు కె.చిన్నపరెడ్డి, ఎన్.నాగిరెడ్డి, టి.విజయ్‌కుమార్, కోటేశ్వరి, శాంతిబాయి, అచ్చమ్మ పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో...

లక్ష్మీపురం: రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్యాన్ని ప్రస్తుత తరం అధ్యాయనం చేయాల్సి అవసరం ఉందని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. డొంకరోడ్డులోని రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ తన సాహిత్యం ద్వారా ఠాగూర్ దేశంలో కుల,మత, వర్గాలకతీతంగా మానవుడు తయారు కావాలని అభిలషించారన్నారు. విశ్రాంత ఇంజినీర్ ఎస్.సదాశివం మాట్లాడుతూ రవీంద్రుడు కేవలం రచయితగానే ఉండి పోక బాలల హృదయాలను వికసింపజేయడానికి ప్రాచీన గురుకులాల తరహాలో శాంతినికేతన్ ఏర్పరిచి ఆతరువాత విశ్వభారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించారన్నారు. మహాత్మగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, పటేల్ లాంటి జాతీయ నాయకులకు రవీంద్రనాథ్ ఠాగూర్ స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నరసింహారావు, జనార్ధనరావు, పీటర్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్‌నాయకుల క్యాండిల్ ర్యాలీ



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీ ఎన్జీవో నాయకులు

గుంటూరు మెడికల్: రేపల్లె 1వ వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ సింగోటి కోటేశ్వరమ్మ మృతికి చింతిస్తూ ఏపీ ఎన్జీ జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ బుధవారం నిర్వహించారు. గుంటూరులోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కోటేశ్వరమ్మ మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉద్యోగస్తులు అందరూ మానసిక స్థైర్యంతో ఉండాలన్నారు. జిల్లా కార్యదర్శి ఆరాధ్యుల శ్యామ్ సుందర్ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సురేపల్లి రాజశేఖర్, జిల్లా సంయుక్త కార్యదర్శులు కె.శ్రీనివాసరావు బి.కృష్ణకిషోర్, కె.వి జయబాబు, ఎం.విజయలక్ష్మి, మహిళా జాయింట్ సెక్రెటరీ కె.శివ జ్యోతి, నగర అధ్యక్షుడు ఎస్పీఎస్ సూరి, సహాధ్యక్షుడు బి.సాంబశివరావు, నగర కోశాధికారి జి.వి.కోటేశ్వరావు పాల్గొన్నారు.